18వ సారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి

మొదటిపేజీ తరువాయి...

మంత్రి పదవులు ఇవ్వటంపై స్పష్టత కోరే అవకాశం ఉన్నది. కాంగ్రెస్ బీ ఫారంపై గెలిచిన వారికే మంత్రి పదవులు ఇస్తామని సీఎం చెప్తున్నా.. జంపింగ్ నేతలకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో ఎవరెవరు వచ్చారు? ఇంకా ఎవరెవరు టచ్‌లో ఉన్నారు? మంత్రి పదవుల హామీ ఎవరెవరికి? ఏ ప్రాతిపదికన పదవులు కట్టబెట్టాలి? వంటి అంశాలపై కసరత్తు చేయనున్నట్టు సమాచారం. దీంతోపాటు పీసీసీ అధ్యక్షుడి ఎంపికకు సస్పెన్స్‌ను తెరదించాలని సీఎం, డిప్యూటీ సీఎం అధిష్ఠానాన్ని కోరనున్నట్టు తెలిసింది. పార్టీ అధ్యక్షుడిని ప్రకటించేందుకు ఇంత సమయం తీసుకోవటంపై పార్టీలో, ప్రజల్లో అసంతృప్తి చెలరేగుతున్న విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు సమాచారం. రాబోయే స్థానిక ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేయాలంటే అత్యవసరంగా అధ్యక్షుడిని ప్రకటించాలని పట్టుబట్టనున్నట్టు తెలిసింది. వీటితోపాటు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలపైనా చర్చించనున్నట్టు తెలిసింది. సమావేశాల నిర్వహణ సందర్భంగా ఎమ్మెల్యేల చేరికను సమర్థించుకోవడం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంపై చర్చించనున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఢిల్లీలో మేడిగడ్డపై ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు, పరీక్షలు, కమిషన్ విచారణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులతో శనివారం నాటి భేటీలో చర్చించిన అంశాలను సీఎం దృష్టికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు తీసుకెళ్లారు. ఆయా అంశాలపై సీఎం తన అభిప్రాయాలను వారికి తెలియజేశారు. నేడు మరోసారి ఎన్‌డీఎస్‌ఏ అధికారులతో భేటీకానున్న నేపథ్యంలో చర్చించాల్సిన అంశాలపై అధికారులు, ఇంజినీర్లకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా విజయ్‌బాబు

తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మువ్వ విజయ్‌బాబు బంజరాహిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరై చైర్మన్ విజయ్ బాబును సత్కరించారు.

పోరాటయోధుడు దాశరథి : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట జ్వాలలు రగిల్చిన యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. సోమవారం దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా సీఎం ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు, ఉర్దూ, సంస్కృతం, ఇంగ్లిష్ భాషల్లో పండితుడైన దాశరథి తన కలం నుంచి ఓ వైపు విప్లవాగ్నిని రగల్చుతూనే, మరోవైపు అనువాద, ప్రణయ కవిత్వాలు, సినీ గీతాలను వెలువరించిన సవ్యసాచి అని పేర్కొన్నారు. దాశరథి పోరాటపటిమ మలిదశ తెలంగాణ ఉద్యమపోరాటానికి స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు.

డిమోటెడ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

- డిప్యూటీ సీఎంకు కూనంనేని లేఖ

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కోలో రెవెన్షన్, డిమోటెడ్ పొందిన విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలో కొంత మంది ఉద్యోగులను అన్యాయంగా డిమోట్, రెవెన్షన్ చేశారని, ఆ విషయాన్ని పరిశీలించి తిరిగి యథాస్థానంలో నియమించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుబీమా దరఖాస్తులకు ఆగస్టు 5 గడువు

హైదరాబాద్, జూలై 21(నమస్తే తెలంగాణ) : రైతుబీమా పథకానికి అర్హులైన కొత్త రైతుల నుంచి వ్యవసాయ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తున్నది. ఆగస్టు 5 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని 18 నుంచి 59 ఏండ్ల వయసు గల రైతులు ఏఈవోకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించింది. ఈ నెల 28 వరకు పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. అర్హులైన రైతులు పట్టాదార్ పాస్‌బుక్ లేదా డిజిటల్ సంతకం చేసిన డీఎస్ పేపర్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది.

రేపు మరో 3 వేల కోట్ల అప్పు

- ఆర్బీఐ ద్వారా బాండ్ల వేలం
- వారం క్రితమే 2వేల కోట్ల రుణం తెచ్చిన రేవంత్ ప్రభుత్వం
- 8 నెలల్లో రూ.35 వేల కోట్లు

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకోవడానికి సిద్ధమైంది. రూ.1,000 కోట్ల విలువైన మూడు బాండ్లను ఆర్బీఐ వద్ద వేలానికి పెట్టింది. 13 ఏండ్లు, 16 ఏండ్లు, 18 ఏండ్ల కాలపరిమితితో రాష్ట్ర ఆర్థికశాఖ ఈ బాండ్లను జారీచేసింది. వీటిని ఈ నెల 23న వేలం వేయనున్నట్టు ఆర్బీఐ వెల్లడించింది. అనంతరం ఆ మొత్తం రాష్ట్ర ఖజానాకు చేరనున్నది. దీంతో ఈ నెలలో రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన అప్పు రూ.7 వేల కోట్లకు, గత 8 నెలల్లో తెచ్చిన అప్పు రూ.35 వేల కోట్లకు చేరనున్నది. ఈ నెలలో టీజీఐఐసీ ద్వారా రూ.2 వేల కోట్లు, 16న మరో రూ.2 వేల కోట్ల రుణం తీసుకున్న రేవంత్ ప్రభు త్వం.. ప్రతి నెలా ఆర్బీఐ నుంచి రూ.5 నుంచి 6 వేల కోట్ల అప్పులు తీసుకుంటున్నది. జూలై, ఆగస్టు నెలల్లో బాండ్ల విక్రయించడం ద్వారా రూ.15 వేల కోట్ల నుం చి రూ.18 వేల కోట్ల వరకు రుణాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తున్నది. కానీ, కాంగ్రె స్ ప్రభుత్వం ఇన్ని అప్పులు చేసినా రాష్ట్రంలో కనీసం ఒక్క భారీ ప్రాజెక్టునుగానీ, ప్రజల జీవితాలను మార్చే కొత్త పథకాన్నిగానీ అమలు చేయకపోవడం గమనార్హం.

రుణమాఫీ పరేషన్!

మొదటిపేజీ తరువాయి...

జాబితాలో వారి పేరు లేకపోవడంతో నిరాశే ఎదురవుతున్నది. తమకు రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను తెలుసుకునేందుకు ఏఈవోల వద్దకు క్యూ కడుతున్నారు. రుణమాఫీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదుదారుల ఆధార్‌కార్డు నంబర్ ఎంట్రీ చేస్తే కొందరికేమో 'రేషన్‌కార్డు లేదని', మరికొందరికేమో 'కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు' అని చూపిస్తున్నది. అందుకనే వారికి రుణమాఫీ వర్తించడం లేదని చెప్తున్నారు. దీంతోపాటు ఆదాయపన్ను చెల్లిస్తున్న వారికి కూడా తొలి జాబితాలో అర్హత ఉన్నా రుణం మాఫీ కాలేదని తెలిసింది. కోతల్లో భాగంగా వీళ్లకు కూడా ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనినిబట్టి రుణమాఫీలో కోతలు ఉండబోవని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఉత్తవేనని స్పష్టమైంది.

భూపాలపల్లిలోని ఎస్‌బీఐ ఎదుట అంటించిన రుణమాఫీ జాబితాల్లో పేర్లను సరిచూసుకుంటున్న రైతులు(ఫైల్)

మోదీ పైసలు పడ్డోళ్లకే రుణమాఫీ

రేషన్‌కార్డు ప్రామాణికంగా కుటుంబాన్ని గుర్తిస్తామని, పీఎం కిసాన్ నిబంధనల్లో అమలుకు అవకాశం ఉన్నంత వరకు పరిగణలోకి తీసుకుంటామని ప్రభుత్వం రుణమాఫీ నిబంధనల్లో పేర్కొన్నది. ఈ నిబంధన వల్ల పెద్ద సంఖ్యలో రైతులు రుణమాఫీకి అనర్హులవుతారన్న విమర్శలు వచ్చాయి. దీంతో నష్టనివారణ చర్యల్లో భాగంగా రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని, పట్టాదార్ పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పారు. తీరా అమలులో మాత్రం ప్రభుత్వం అన్నంత పనీ చేసింది. పీఎం కిసాన్ నిబంధనలను అన్నింటిని రుణమాఫీలో అమలు చేస్తున్నది. అందుకే రేషన్‌కార్డు లేని వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ఆదాయపు పన్ను చెల్లించేవారికి, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి రుణమాఫీ కావడం లేదు. ఒక విధంగా చెప్పాలంటే పీఎం కిసాన్ పెట్టుబడి సాయం అందుతున్న వారికి మాత్రమే రుణమాఫీ అవుతున్నది. పీఎం కిసాన్ అందుతున్న వారిలోనూ ప్రభుత్వం కోతలు పెట్టడం గమనార్హం. రేషన్‌కార్డును కచ్చితం చేయడంతో పీఎం కిసాన్ సాయం అందుతున్నప్పటికీ రేషన్‌కార్డు లేకపోతే వాళ్లకు కూడా రుణమాఫీ కావడం లేదు. పీఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్యకు కాస్త అటు ఇటుగా రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యను ప్రభుత్వం గుర్తించడం అనుమానాలను పటాపంచలు చేస్తున్నది. రాష్ట్రంలో పీఎం కిసాన్ పెట్టుబడి సాయం సుమారు 33 లక్షల మంది రైతులకు అందుతున్నది. ఇప్పుడు రుణమాఫీకి కూడా ప్రభుత్వం సుమారు 32.5 లక్షల మంది రైతులను మాత్రమే అర్హులుగా తేల్చింది.

మొత్తం కుటుంబానికే కోత

రుణమాఫీలో కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే కాదు, వారి కుటుంబం మొత్తానికి కోత పెడుతున్నట్టు తెలిసింది. ఆధార్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులను గ్రూపింగ్ చేసి వారిలో ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా మొత్తం కుటుంబ సభ్యులకు రుణమాఫీ చేయడం లేదని తెలిసింది. వారు వేర్వేరుగా ఉంటున్నప్పటికీ అందరినీ రుణమాఫీకి దూరం చేస్తున్నారు. ఒకవేళ తీసేయాల్సి వస్తే ఉద్యోగిని మినహాయించాలి గానీ కుటుంబం మొత్తాన్ని మినహాయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలతో భారీ సంఖ్యలో రైతులు రుణమాఫీకి నోచుకోవడం లేదు. రూ. లక్ష రుణమాఫీకే ఇలా ఉంటే ఆ పైన రుణాల మాఫీల ఇంకెలా ఉంటుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీ కాని రైతు వివరాల సేకరణ

- 'కేసీఆర్ మాఫీ చేసిండు.. ఇప్పుడు కాలే'కు స్పందన
- 'నమస్తే తెలంగాణ' కథనంతో కదిలిన అధికారులు

మరికల్, జూలై 21: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రానికి చెందిన రైతు గొల్ల రాములు 2015లో పాస్‌బుక్కు జతచేసి రూ.45 వేల రుణం తీసుకున్నాడు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేసినట్టు ప్రకటించిన జాబితాలో రాములు పేరు లేదు. దీంతో ఈ నెల 19న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'కేసీఆర్ మాఫీ చేసిండు.. ఇప్పుడు కాలే' శీర్షికన రాములు అభిప్రాయం ప్రచురితమైంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మరికల్ ఏఈవో పరశురాంకు ఫోన్ చేసి గొల్ల రాములు వివరాలు పంపాలని ఆదేశించారు. ఏఈవో పరశురాం బ్యాంక్ అధికారుల నుంచి రైతు వివరాలు సేకరించారు. పాస్‌బుక్కు లేకపోవడంతోనే రుణమాఫీ జాబితాలో పేరు రాలేదని బ్యాంక్ అధికారులు స్టేటస్ ఇచ్చినట్టు పరశురాం తెలిపారు. రైతు రాములు మాట్లాడుతూ.. తన పేరు మీద భూమి, పాస్‌బుక్కు లేకపోతే అప్పు ఎలా ఇచ్చారంటూ అధికారుల తీరును ప్రశ్నించాడు. తాను తీసుకున్న రుణం రూ.45 వేలను మాఫీ చేయాలని డిమాండ్ చేశాడు.

సాగుకు మళ్లీ రుణం తీసుకొవచ్చనుకున్నా..

కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ చేస్తే వర్షాకాలం సాగుకు పెట్టుబడికి ఉపయోగపడుతుందని ఆశించా. రుణమాఫీ ప్రకటన కోసం ఎదురు చూశా. కానీ తొలివిడత జాబితాలో నా పేరు లేదు. నా ఆశలన్నీ ఆవిరయ్యాయి. ఇగ సాగుకు ప్రైవేటుగా అప్పు చేయడమే గతి. దొడ్డు ధాన్యాన్ని సైతం ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్న నమ్మకం పోయింది. ఇగ మా కష్టాలు ఇలా కొనసాగాల్సిందే.

-మట్టపర్తి భాస్కర్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

అంతా అయోమయం

నేను కేసీఆర్ ప్రభుత్వంలో రుణమాఫీ పొందిన. ఆ తర్వాత మళ్లీ రూ.లక్ష రుణం తీసుకున్నా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పుడు రెండు లక్షల రుణమాఫీ అంటున్నది. కానీ, నేను తీసుకున్న రూ.లక్ష కూడా నాకు మాఫీ కాలేదు. మాఫీ గురించి నాకు ఎలాంటి మెసేజ్ రాలేదు. దీనిపై ఎవరిని అడగాలో తెలియడం లేదు. అంతా అయోమయంగా ఉన్నది.

-దేశబోయిన రాజు, యువరైతు, కొరిపెల్లి, పెద్దవంగర మండలం, మహబూబాబాద్ జిల్లా

రూ.23 వేలకు 13వేలే అయ్యింది..

నేను 2022, జూలైలో తలమడుగులోని మహారాష్ట్ర బ్యాంకులో రూ.20 వేల పంట రుణం తీసుకున్నా. వడ్డీతోపాటు రూ.23 వేలు అయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీకి అర్హుడినే. బ్యాంకులో అడిగితే నీ లోన్ ఖాతాలో రూ.13,433 జమ అయినట్టు అధికారులు చెప్పారు. ఇంకా రూ.10వేలపై స్పష్టత లేదు. బ్యాంకు, వ్యవసాయ అధికారులను అడిగినా మాకు తెలియదంటున్నారు.

- లింగాల దేవన్న, తలమడుగు, ఆదిలాబాద్ జిల్లా

మాఫీపై స్పష్టత ఏది?

మాది పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల. నేను ఇక్కడి యూనియన్ బ్యాంకులో లక్ష పంట రుణం తీసుకు న్నా. మాఫీ లిస్టులో నా పేరు లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే అధికారులు ఇచ్చిన సమాధానంలో స్పష్టత లేదు. ఏ షరతు లేకుండా మాఫీ చేస్తేనే కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు చేసినట్టవుతుంది. కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ దేవుడెరుగు, రైతుబంధు కూడా ఇయ్యట్లే.

-బూత్కూరు శ్రీదేవి, దేవరుప్పుల, పాలకుర్తి నియోజకవర్గం, జనగామ జిల్లా

వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తేవాల్సిందే..

వేసవి కాలంలో వేసిన పంట పండక పోవడంతో నష్టం వచ్చింది. వర్షాకాలం బీడుపీడలకు తట్టుకుని పండేది దొడ్డు వడ్లే. సన్న వడ్లకే బోనస్ అని కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చింది. రూ.లక్షలోపు రుణమాఫీ జాబితాలో నా పేరే లేదు. ఇంతవరకు వర్షాకాలం పంట పెట్టుబడికి రైతుభరోసా కూడా రాలే. మళ్లీ వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాల్సిన కాలం వచ్చింది.

- రావి అరుణ, ముష్టిబండ, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు!

- నిబంధనలకు వ్యతిరేకంగా ట్రాన్స్‌ఫర్లు
- అనుమానాలు వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు
- బదిలీ ప్రక్రియ పునఃపరిశీలించాలి
- ప్రభుత్వానికి ఆర్థిక శాఖ డైరెక్టర్ వర్క్స్ అకౌంట్స్ బాధిత ఉద్యోగుల వినతి



ఉదాహరణ 1: హనుమకొండలోని మిషన్ భగీరథ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక డీఏవో 6 ఏండ్లకుపైగా ఒకే స్టేషన్‌లో పనిచేసినా బదిలీ జాబితాలోకి తీసుకోలేదు.

ఉదాహరణ2: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ములుగు కార్యాలయంలో ఉన్న క్లియర్ వేకెన్సీని వర్కింగ్ స్టేషన్ సర్వీస్ ప్రకారం సీనియర్ ఉద్యోగులకు చూపించకుండా మిషన్ భగీరథ వరంగల్ కార్యాలయంలో తక్కువ సర్వీస్‌తో పనిచేస్తున్న మరొక డీఏవోకు కేటాయించినట్టు తెలిసింది.

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఆర్థిక శాఖ డైరెక్టర్ వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో జరిగిన ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు జరిగాయని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ విభాగంలో నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీలు జరిగాయని అనుమానిస్తున్నారు. దాంతో తమకు అన్యాయం జరిగిందని వాపోతున్నారు. ఒక ప్రదేశంలో నాలుగేండ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న ప్రతి ఉద్యోగిని బదిలీ చేయాలి. కానీ, డైరెక్టర్ వర్క్స్ అకౌంట్స్ కార్యాలయంలోని డివిజనల్ అకౌంట్స్ అధికారుల(డీఏవో) బదిలీల్లో సీనియారిటీని సక్రమంగా లెక్కించలేదని చర్చించుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు ఒకే స్టేషన్‌లో 6-7 ఏండ్ల సర్వీసు పూర్తిచేసుకున్నా వారి వివరాలు పూర్తిగా సేకరించలేదని ఆరోపిస్తున్నారు. బదిలీ నిబంధన 40% పరిధిలోకి తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఒక ప్రదేశంలో తక్కువ కాలం పని చేసినా, తప్పనిసరి బదిలీల్లోకి వచ్చామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, సీనియర్ ఉద్యోగులకు పూర్తి వేకెన్సీ చూపకుండా, తక్కువ కాలం పనిచేసిన జూనియర్ ఉద్యోగులకు ముందే కొన్ని వేకెన్సీలను రిజర్వ్ చేసి.. తమకు బదిలీ ఆర్డర్స్ ఇచ్చారని పేర్కొంటున్నారు.

వైద్యశాఖ బదిలీలపై సీఎం ఆరా!

- సీనియార్టీ, వేకెన్సీ జాబితాపై ఆరోపణలేంటి?
- ఒక్క వైద్యారోగ్య శాఖలోనే ఎందుకింత రచ్చ
- సమగ్ర నివేదికకు ఆదేశించినట్టు సమాచారం

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖలో జరుగుతున్న బదిలీల రచ్చపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్టు సమాచారం. మిగతా అన్ని శాఖల్లో సజావుగా బదిలీలు జరుగుతుండగా, ఒక్క వైద్యారోగ్య శాఖలోనే ఎందుకు ఆందోళనలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులను అడిగినట్టు తెలిసింది. రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపడం, రోజులపాటు బదిలీలు నిలిచిపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అసలు ఏం జరుగుతున్నదో సమగ్ర వివరాలు సేకరించి, నివేదిక అందించాలని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. వైద్యారోగ్య శాఖలోని ఇతర విభాగాల్లో బదిలీలు సాఫీగా సాగుతున్నాయని, డీపీహెచ్ పరిధిలో మాత్రమే రచ్చ జరుగుతున్నదని అధికారులు సీఎంకు తెలిపినట్టు సమాచారం. సీనియార్టీ జాబితాను ఇప్పటి వరకు నాలుగుసార్లు రివైజ్డ్ చేశారని, అయినా తప్పులు ఉన్నాయంటూ అనేక ఉదాహరణలు తమ దృష్టికి వచ్చాయని చెప్పినట్టు తెలిసింది. అధికారుల చేతివాటం, సంఘాల నేతల అడ్డగోలు ప్రమేయం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని సీఎంకు వివరించినట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. ఒక్క నర్సులే కాకుండా ల్యాబ్ అసిస్టెంట్ మొదలు డిప్యూటీ డైరెక్టర్ వరకు ఇదే తంతు కొనసాగిందని చెప్పినట్టు సమాచారం. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో పాతుకుపోయిన వారిని బదిలీ చేయకుండా, అక్కడే రిటెయిన్ చేయడంపై దుమారం రేగిందని చెప్పారట. దీంతో తాను ఢిల్లీ నుంచి వచ్చేలోగా నివేదిక సిద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించినట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి.

చిన్నారుల వినూత్న నిరసన

- వీధికుక్కల నుంచి రక్షించండి
- రెండేండ్లుగా 75 మందికి గాయాలు
- కొంపల్లి కమిషనర్‌పై పీఎస్‌లో ఫిర్యాదు
- పేట్ బషీరాబాద్ స్టేషన్ ఎదుట నార్త్ ఎన్‌సీఎల్ కాలనీ బాలలు ప్లకార్డులతో ప్రదర్శన

పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట వీధికుక్కల దాడుల నుంచి రక్షించండి... మహాప్రభో' అంటూ ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న కొంపల్లి మున్సిపాలిటీ నార్త్ ఎన్‌సీఎల్ కాలనీ చిన్నారులు

కుత్బుల్లాపూర్, జూలై 21: 'కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రమైంది.. రోడ్లపై వెళ్లాలంటేనే భయమేస్తుంది.. ఇప్పటికే రెండేండ్లలో ఎందరో మా తోటి బాలలు కుక్కల దాడుల్లో తీవ్ర గాయాలపాలయ్యారు.. అయినా మా కాలనీ అధికారులు పట్టించుకోవడం లేదు.. రేవంత్ అంకుల్ మీరే మమ్మల్ని కాపాడండి.' అంటూ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీ చిన్నారులు వేడుకుంటున్నారు. వీధి కుక్కల బెడదను తట్టుకోలేక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న ఆ చిన్నారులు పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరిపై ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్ అంకుల్ మీరైనా స్పందించండి.. కొంపల్లి మున్సిపాలిటీలో వీధికుక్కల స్వైరవిహారానికి అడ్డుకట్ట వేయండి.. మా ప్రాణాలకు రక్షణ కల్పించండి.. అంటూ ప్లకార్డులను చిన్నారులు ప్రదర్శిస్తూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

పలువురు బాలలకు తీవ్రగాయాలు

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో రెండేండ్ల నుంచి సుమారు 75 మందికి పైగా బాలలు, వృద్ధులు, మహిళలు తీవ్రగాయాల పాలయ్యారని పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట కాలనీవాసులు, చిన్నారులు తెలిపారు. ఓ చిన్నారిని కరిచిన కుక్కను తరమబోయిన తల్లిపై దాడి చేసిందని, పరిగెత్తుకుంటూ ఇంట్లోకి వెళ్లినా వెంబడించి మరీ కరిచిందని వారు తెలిపారు. బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ కార్మికుడి ఐదేండ్ల కూతురు గుడిసె బయట ఆడుకుంటుండగా వీధికుక్కలు కర్కశంగా దాడి చేయగా కుడిచెయ్యి, కుడి కాలు తీసేయాల్సి వచ్చిందని వివరించారు. ఓ బాలుడి ముఖం ప్లాస్టిక్ సర్జరీ చేయాల్సి వచ్చిందని, నడుచుకుంటూ వెళ్తున్న మరో వ్యక్తిపై దాడి చేయగా కుడికాలు తోడభాగాన్ని పీకిన ఘటనలు చోటుచేసుకున్నాయని చెప్పారు. వీధి కుక్కల బెడదపై అనేకమార్లు ఉన్నతాధికారులు, కొంపల్లి మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వీధికుక్కల బారి నుంచి కాపాడాలని చిన్నారులు వేడుకుంటున్నారు.

'డబుల్' ఇండ్లల్లోకి ప్రవేశం

- పోలీసులతో గుడిసెవాసుల వాగ్వాదం
- అంబేద్కర్‌నగరలో ఉద్రిక్తత
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ

హనుమకొండ, జూలై 21: హనుమకొండ బాలసముద్రం పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో గల డబుల్ బెడ్రూం ఇండ్ల తాళాలు పగులగొట్టి పేదలు అక్రమంగా ప్రవేశించారు. ఆదివారం వారు ఇండ్లను శుభ్రం చేసుకున్నారు. తమకు ఇండ్లు కేటాయించే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు గుడిసెవాసులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. వారిని ఇండ్ల నుంచి బయటకు పంపించడంతో అక్కడే వర్షంలోనే బైఠాయించారు. ఇండ్లు నిర్మించి ఐదేండ్లు అవుతున్నా లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఏడు నెలలు గడిచినా ఇప్పటివరకు ఇండ్లు పంపిణీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హనుమకొండ తహసీల్దార్ అక్కడికి చేరుకొని విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో డబుల్ బెడ్ రూంల ఇండ్ల ఎదుట ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

కాంగ్రెస్ సర్కారుపై అసహనం

- ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత
- అడుగడుగునా అనుభవ రాహిత్యం
- కీలక నిర్ణయాల్లో ప్రభుత్వం తడబాటు
- సొంత పార్టీ నేతల్లోనూ నైరాశ్యం

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసహనం వ్యక్తమవుతున్నది. ఆదరాబాదరాగా నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వం.. ప్రజల నుంచి వ్యతిరేకత రాగానే వెనక్కి తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు ముఖ్యమంత్రి నుంచి మ